క్లుప్తంగా

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

బిక్కవోలు: సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు, గుండాట, పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తే చర్యలు తప్పవని రంగంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్(ఎస్‌ఈబీ) సీఐ జి.వెంకటలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పండగ రోజుల్లో గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామని చెప్పారు.

పెదపూడి: సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో వేడుకగా నిర్వహించుకోవాలని పెదపూడి తహసీల్దార్ టి.సుభాష్, ఎస్‌ఐ శోభన్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి సందర్భంగా గురువారం పెదపూడి తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల వీఆర్వోలు, పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్, ఎస్‌ఐలు మాట్లాడుతూ కోడి పందేలు, జూదాలను నిలువరించడానికి తీసుకోవాల్సిన చర్యలతో పాటు రాబోయే ఎన్నికలను సజావుగా జరిపేందుకు ముందస్తు సన్నాహాలపై చర్చించారు. నిబంధనలకు విరుద్ధంగా పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మనో వికాసానికి, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని కుతుకులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించే తాడి మురళీకృష్ణారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. సంప్రదాయ క్రీడలపై యువతకు ఆసక్తి కలిగించేలా వివిధ క్రీడాపోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమ తులసి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, ఉపసర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పులగం రామకృష్ణారెడ్డి, పార్టీ జిల్లా మహిళా విభాగం కార్యదర్శి తేతలి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై గ్రామోత్సవం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం స్వామి వారికి సుప్రభాతసేవ, లఘు అర్చన, తోమాల సేవ, పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి సచివాలయం-1 వద్ద శుక్రవారం ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు బిక్కవోలు పీహెచ్‌సీ వైద్యురాలు దుర్గాదేవి తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా గురువారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ప్రతినిధి ఛత్రపతి శివాజీ మాట్లాడుతూ సమాజంలో పేదలను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పప్పు శ్రీనివాసరెడ్డి, యువరాజారెడ్డి, రాయుడు రాఘువ, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, ద్వారంపూడి భాస్కరరెడ్డి, ఆర్.నాగు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని హర్ష్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాజానగరం: రాష్ట్ర స్థాయిలో యువజన సేవల కమిషనర్ ఆధ్వర్యంలో విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో ఈ నెల 7 నుంచి 9 వరకూ జరిగిన పోటీల్లో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని ఎస్.హర్ష్య కథా రచనలో తృతీయ స్థానం పొందింది. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ధనరాజ్ గురువారం తెలిపారు. ఆ విద్యార్థినిని పలువురు అభినందించారు.

ఘనంగా కుడారై ఉత్సవం

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కుడారై ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 108 పాత్రలతో పాయసాన్ని స్వామికి సమర్పించారు. అర్చక స్వామి అనంతాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటి రెడ్డిమ్మ, బొండాడ చందు పాల్గొన్నారు.

కోడి పందేలకు సై అంటే సై

- బరులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు
- పుంజులకు పెరిగిన డిమాండ్



బిక్కవోలు: గ్రామాల్లో సంక్రాంతి పండగ సందడి నెలకొంది. పండగ సమీపిస్తున్న నేపథ్యంలో కోడి పందేలు నిర్వహించేందుకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో కోడి పందేల కోసం బరులను సిద్ధం చేసుకుంటున్నారు. పందెంలో పోటీకి దింపనున్న కోడి పుంజులకు బలవర్ధకమైన ఆహారాన్ని పెట్టడంతో పాటు తర్ఫీదునిస్తున్నారు.

పుంజులకు భారీ గిరాకీ

పందేల నేపథ్యంలో కోడి పుంజులకు భారీగా డిమాండ్ పెరిగింది. జాతి రకం, రంగును బట్టి పుంజు రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకూ ధర పలుకుతోంది. వీటిలో కాకి, డేగ, నెమలి, పరదా, పచ్చకాకి, పెట్టమారు, రసంగి, తీతువా, సింగాలి వంటి రకాలున్నాయి. జూదరులు ఎక్కువగా పచ్చకాకి, డేగ రకాలపై మక్కువ చూపుతుండడంతో వాటికి డిమాండ్ బాగా పెరిగింది. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో పందెం రాయుళ్లు సుమారు 20కు పైగా ప్రాంతాల్లో బరులు సిద్ధం చేసినట్లు సమాచారం.

సంప్రదాయం ముసుగులో జూదం

సంప్రదాయకంగా కోడి పందేలు జరుపుకుంటున్నామని నిర్వాహకులు చెబుతున్నా ఏటా తెర వెనుక గుండాట, మూడు ముక్కలాట వంటి జూదాలు నిర్వహిస్తున్నారు. అలాగే బరుల వద్ద మద్యపాన ప్రియులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గుట్కాలు, ఖైనీలు షరా మామూలే. మరో వైపు కోడి పందేలకు అనుమతులు లేవని, ఎవరైనా పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 200 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామంటూ అధికారులు చెబుతున్నారు. ఏటా పోలీసులు హెచ్చరికలు జారీ చేయడం, చివరికి చేతులెత్తేయడం మామూలేనన్న మాట నిర్వాహకుల నుంచి వినిపిస్తుంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



కోడి పందేలు, పేకాట, గుండాటలకు ఎలాంటి అనుమతులు లేవు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గస్తీ ముమ్మరం చేశాం. ఎక్కడైనా పందేలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

– పి.బుజ్జిబాబు, ఎస్‌ఐ, బిక్కవోలు

ఆ భూముల రిజిస్ట్రేషన్‌కు అనుమతించండి

- నిషేధం తొలగించి ఊరట ఇవ్వండి
- మంత్రి కొట్టును కోరిన ఎమ్మెల్యే రాజా



మంత్రి కొట్టు సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా నిషేధ జాబితాలో ఉన్న కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిధిలోని భూములకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలుసుకుని తన విన్నపాన్ని తెలియజేశారు. 2013 నుంచి ఈ భూములకు రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో సంబంధిత రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిషేధాన్ని తొలగించి, క్రయవిక్రయాలకు అవకాశం కల్పించడం ద్వారా ఆయా రైతులకు ఊరటనివ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి కొట్టు సత్యనారాయణ త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

మెట్ట రైతులకు వరం.. పామాయిల్ తోటల పెంపకం

రంగంపేట: పామాయిల్ తోటల పెంపకం మెట్ట ప్రాంత రైతులకు వరమని పతంజలి గ్రూప్ పెద్దాపురం పామాయిల్ ఫ్యాక్టరీ డీజీఎం రవీంద్ర అన్నారు. గురువారం మండలంలోని సింగంపల్లిలో జరిగిన పామాయిల్ రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పామాయిల్ సాగులో దేశంలోనే ద్వితీయ స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం సగటున ఎనిమిది టన్నులుగా ఉన్న పామాయిల్ గెలల దిగుబడి కొద్దిపాటి శ్రద్ధతో పది టన్నులకు పెంచుకుని రైతులు లాభపడాలని ఆయన సూచించారు. పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి పామాయిల్ కర్మాగారం యాజమాన్యంతో పాటు ఉద్యానవన శాఖ కూడా కృషి చేయాలని రైతు ప్రతినిధులు ముత్యాల శ్రీనుబాబు, సీతారామయ్య, కొమ్మన రాంబాబు, యానాల కొండయ్య విజ్ఞప్తి చేశారు. ఫ్యాక్టరీ సాంకేతిక సిబ్బంది ఓంకార్, సత్యనారాయణ, వెంకట్రావు, ఉద్యాన శాఖ ప్రతినిధులు అరవింద్, రామకృష్ణ రైతులకు పలు సూచనలు చేశారు.



సింగంపల్లిలో పామాయిల్ రైతులతో మాట్లాడుతున్న డీజీఎం రవీంద్ర


గోదాదేవి అమ్మవారికి చీర, సారె



సంపరలో గోదాదేవికి సారె తీసుకొచ్చిన భక్తులు

పెదపూడి: మండలంలోని సంపర వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి అమ్మవారికి భక్తులు చీర, సారె సమర్పించారు. పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మామిడి తోటలను రక్షించుకోవాలిలా..



పూతతో నిగనిగలాడుతున్న మామిడి చెట్టు

రాజానగరం: ప్రస్తుత సీజన్‌లో మామిడి తోటలు పూతలతో కనువిందు చేస్తుంటాయి. ఈ సమయంలో ఆశించే చీడపీడల నుంచి తోటలకు కాపాడుకుని, మంచి దిగుబడులు సాధించేందుకు మామిడి తోటల రైతులకు ఉద్యానవన శాఖ అధికారి కె.రిణి కొన్ని సూచనలు చేశారు.

- పూత దశలో ఉండగా మామిడిని తేనే మంచు పురుగు ఆశిస్తుంటుంది. దీని నివారణకు ఒక మి.లీ. డైక్లోరోవాస్ మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూత, మొగ్గ దశలో ఉండగా ఈ మందును చల్లాలి.
- పిందె దశలో ఉండగా ఒక మి.లీ. ఫాస్ఫామిడాన్ లేదా 2 మి.లీ. మిథైల్ డెమటాన్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కొత్త చిగురు వేసే దశలో తామర పురుగు (త్రిప్స్) సోకే అవకాశం ఉంది. దీని నివారణకు 2 మి.లీ. మిథైల్ డెమటాన్ మందును లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయడం మంచిది.
- టెంక పురుగు నివారణకు ఒక మి.లీ. పెంథియాన్‌గాని, 3 గ్రాములు కార్బరిల్‌గాని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పిందె దశలో 15 రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు ఈ మందులను అటునిటు మార్చుతూ చల్లడం వలన టెంక పురుగును నివారించవచ్చు.
- పక్షి కన్ను తెగులుగా పిలిచే ఆంత్రక్నోస్ తెగులు నివారణకు మొగ్గ బయటకు వచ్చే సమయంలో కాపర్ ఆక్సీక్లోరైడ్, ఒక గ్రాము కార్బండిజమ్ లేదా 2 గ్రాములు థయోపానేట్ మందును ఒక లీటరు నీటిలో కలిపి చల్లాలి. అలాగే 3 గ్రాములు వెట్టబుల్ గంధం ఒక లీటరు నీటిలో కలిపి చల్లడం ద్వారా బూడిద తెగులును నివారించవచ్చు.
- కాయతెలుచు పురుగును నివారించేందుకు ముందుగా తోటలో ఎండిన మామిడి కొమ్మలను పూర్తిగా తొలగించాలి. ఆపై కాయ దశలో ఒక శాతం వేపనూనె ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా ఈ తెగులును నివారించవచ్చు.

రేపు మర్రిపూడిలో ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

రంగంపేట: మండలంలోని మర్రిపూడిలో శనివారం రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పర్యటిస్తారని మండల పంచాయితీరాజ్ జేఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మర్రిపూడిలో రూ.23.94 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.43.60 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాలను వారిద్దరూ ప్రారంభిస్తారన్నారు. కావున ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన జిల్లా మహిళా సంక్షేమ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి ఉన్నత పాఠశాల వద్ద పదో తరగతి విద్యార్థులకు జిల్లా మహిళా సంక్షేమ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధమై మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి, పెంకే గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



సంక్రాంతి సంబరాల్లో భోగి మంటను వెలిగిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- డస్ట్‌బిన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం

అనపర్తి: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులకు డస్ట్‌బిన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసేందుకు గాను డిస్ట్‌బిన్స్ పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. అనంతరం గ్రామస్తులకు డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సచివాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొని భోగి మంటను వెలిగించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీటీసీ కొండేటి భీమేష్, ఈటీపీఆర్డీ పద్మజ, పంచాయితీ కార్యదర్శి మల్లిడి విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

నూరు.. వరుసగా మూడో మారు

అనపర్తి: గ్రామ పంచాయతీల మనుగడకు ఇంటిపన్నులే ప్రధాన వనరు. అయితే ఇటీవల కాలంలో ఇంటి పన్నుల బకాయిలు పేరుకుపోయి కనీసం గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి అనేక పంచాయితీలు చేరుకుంటున్నాయి. అయితే దీనికి భిన్నంగా మండలంలోని కొప్పవరం గ్రామ పంచాయతీ వరుసగా మూడో సంవత్సరం కూడా నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేసి స్వావలంబన దిశగా అడుగులేస్తోంది. చాలా పంచాయితీల్లో ఏడాది పొడవునా వసూలు చేసినా నూరు శాతం వసూళ్లు గగనమవుతున్న తరుణంలో కొప్పవరం పంచాయతీ మాత్రం అతి తక్కువ రోజుల్లోనే రికార్డు స్థాయిలో పన్నులు వసూలు చేసుకుంటోంది. 2023–24 సంవత్సరానికి గాను కేవలం 14 రోజుల్లోనే డిమాండ్ రూ.8,92,339 వసూళ్లు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తాడి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. డిసెంబరు 28న ఇంటి పన్నుల వసూళ్లు ప్రారంభించి జనవరి 11 నాటికి నూరు శాతం వసూలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పాలకవర్గం హయాంలో 2021–22లో 18 రోజుల్లోను, 2022–23లో 14 రోజుల్లోను మొత్తం పన్నులు వసూలు చేసి రికార్డు సృష్టించారు. 2023–2024లో తమ రికార్డును తామే తిరగరాస్తూ కేవలం 14 రోజుల్లోనే నూరు శాతం పన్నులు వసూలైనట్లు సర్పంచ్ కర్రి బుల్లి మోహన్‌రెడ్డి తెలిపారు. వలంటీర్లు వెళ్లిన వెంటనే పన్నులు చెల్లించి సహకరించిన గ్రామస్తులకు సర్పంచ్ బుల్లిమోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



కొప్పవరంలో వలంటీర్‌కు ఇంటి పన్ను చెల్లిస్తున్న గృహిణి

మహిళపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

రాజానగరం: నరేంద్రపురంలో ఒంటరి మహిళపై దాడి చేసి, అమానుషంగా ప్రవర్తించిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం, ప్రగతి శీల మహిళా సంఘం, ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య డిమాండ్ చేశాయి. ఈ మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బాధితురాలితో కలిసి గురువారం కొద్దిసేపు ఆందోళన చేశాయి. అనంతరం బాధితురాలు తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ తహసీల్దార్ పవన్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నరేంద్రపురంలోని శెట్టిబలిజపేట రామాలయం వద్ద నివాసం ఉంటున్న ఒంటరి మహిళ గుత్తుల కృష్ణవేణి ఈనెల 3న కూలీ పనికి పోయి, రాత్రి 10 గంటలకు ఇంటికి చేరుకుంది. అప్పటికే అక్కడకు పెంకే దుర్గారావు, అతడి అక్క సత్యవతి, భార్య వరలక్ష్మి, అతని చిన్న, మరో ఇద్దరు మేనళ్లల్లు, మరికొందరు బ్లేడ్ బ్యాచ్ కుర్రాళ్లు ఆటోలో వచ్చి ఉన్నారు. ఆమెను చూసిన వెంటనే వారు రెచ్చిపోయి, వివస్త్రను చేసి, వెంట తెచ్చిన కర్రలు, కత్తులతో ఇష్టానుసారంగా కొట్టి గాయపరిచారు. చుట్టుప్రక్కల వారు వచ్చి, ఆమెను కాపాడి, ఇంటిలోకి పంపించివేశారు. అయినాగాని వారు పోకుండా ఇంటిని కూడా పాడుచేశారు. ఈ సంఘటన పై వెంటనే రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, చికిత్స నిమిత్తం ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి పంపించారు. కానీ నిందితులను మాత్రం ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని, వాళ్లు స్వేచ్ఛగా తిరుగుతూ తనను చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని గుత్తుల కృష్ణవేణి ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు..



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాలు

షోకాజ్ నోటీసుల జారీ

సీతానగరం: మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తహసీల్దార్ పాగిరి కృష్ణారావు తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సమ్మె విరమించి, విధులకు హాజరుకావాలని కోరుతూ నోటీసులు జారీ చేశామన్నారు. మండలంలోని వీఆర్వోలు ఈ నోటీసులు అందించారన్నారు.

425 మందికి వైద్యసేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 425 మందికి సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. అనంతరం గ్రామంలో మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లను సందర్శించి పిల్లల బరువు చూశారు. వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి, ఏఎన్‌ఎం అరుణ, ఆశా వర్కర్లు కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలుకు చెందిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బిక్కవోలుకు చెందిన అప్పలనాయుడు తనను కోరిక తీర్చమని వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన జమ్ము పార్వతి ఫిర్యాదుచేసింది. మరో వైపు జమ్ము పార్వతితో పాటు ఆమె బంధువులు తనను తీవ్రంగా గాయపరిచారని అప్పలనాయుడు ఫిర్యాదుచేశారు. దీంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ బుజ్జిబాబు చెప్పారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

సీతానగరం: సంక్రాంతి సందర్భంగా సీతానగరం పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, యానాదుల కుటుంబాలకు గురువారం దుస్తులను పంపిణీ చేశారు. సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ తమ సొంత నగదుతో 19 మంది పంచాయతీ కార్మికులకు ఒకొక్కరికి నాలుగు జతల దుస్తులను, సంత మార్కెట్ వద్ద నివాసం ఉంటున్న 14 యానాదుల కుటుంబాలకు మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలోరాజు) తన సొంత నగదుతో టీ షర్ట్, గౌన్లు, చీరలు, దుప్పట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మద్దాల కొండలరావు, కోలా శ్రీను, తోరం బ్రహ్మాజీ, కాండ్రు వీరన్న, మట్ట కాపు, సలాది వాసు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎంపీపీ సూర్యకుమారికి మాతృవియోగం

మధురపూడి: కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్యసూర్యకుమారి తల్లి తేలు సత్యవతి బుధవారం మృతి చెందారు. ఆమె అంత్యక్రియలను గురువారం నిర్వహించారు. ఆమె భౌతిక కాయానికి పలువురు నివాళులర్పించారు. ఎంపీపీ సూర్యకుమారి, ఆమె భర్త, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబును పరామర్శించారు. కాగా.. ఎంపీపీ తండ్రి తేలు సూర్యచంద్రరావు డిసెంబర్ 20న మృతి చెందారు. పరామర్శించిన వారిలో గ్రామ సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, మాజీ సర్పంచ్ నాగా సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ ఉల్లి చెల్లారావు, కోరుకొండ పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాగా రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు నీరుకొండ బాబ్జీ, జనసేన నాయకుడు బదిరెడ్డి దొర ఉన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

రాజానగరం: సంక్రాంతి సంబరాలలో భాగంగా జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజానగరం మండలం లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ, రఘునాథపురాల్లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వీటిని తిలకించిన వైఎస్సార్ సీపీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ మగువలకు, రంగవల్లులకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ విధంగా పోటీలు నిర్వహించాలని భావిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విజేతలకు వాషింగ్ మెషీన్, మిక్సీ, డిన్నర్ సెట్లను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతిగా వాషింగ్ మెషీన్‌ను అందజేస్తున్న విజయలక్ష్మి